నమస్తే తెలంగాణ
# సంగారెడ్డి
I | హైదరాబాద్, సోమవారం 10 మార్చి 2025 | SANGAREDDY



మద్దూరు మండలంలోని మర్మాములలో బోరు వేసిన ప్రదేశాన్ని చూపుతున్న రైతు కిష్టయ్య


## పశువులకు మేతగా మారిన పొలం

కొమురవెల్లి, మార్చి 9: కాంగ్రెస్ పాలనలో రైతులకు నీళ్ల కష్టాలు మొదలయ్యాయి. కొమురవెల్లికి చెందిన రైతు సార్ల నర్సింహులు యాసంగిలో ఎనిమిది ఎకరాల్లో వరి పంట వేశాడు. కొన్ని రోజులుగా నాలుగు బోర్ల నుంచి నీళ్లు తక్కువగా వస్తుండడంతో వరి పంటకు పూర్తిగా నీళ్లు అందడం లేదు. తపాస్‌పల్లి రిజర్వాయర్ ద్వారా కాలువల్లోకి నీళ్లు వదులుతారని చూసిన రైతు నర్సింహులుకు నిరాశ మిగిలింది. చేసిదేమి లేక వేసిన పంటలో సగమైన కాపాడుకుందామని పొట్ట దశకు వచ్చిన 8 ఎకరాల వరిలో 4 ఎకరాలు వరి పంటను కోసి పశువులకు మేత వేశాడు. ఈ సందర్భంగా రైతు నర్సింహులు మాట్లాడుతూ..



కొమురవెల్లిలో ఎండిన వరిని కోస్తున్న రైతు

కేసీఆర్ సీఎంగా ఉన్నప్పుడు ఒక్క గుంట ఎండలేదని, గిప్పుడు 4 ఎకరాల పంట పశువులకు మేతగా వేశానని, రూ.1.20 లక్షల నష్టం వాటిల్లిందన్నారు.



వ్యవసాయానికి నీరందక సంగారెడ్డి జిల్లాలోని పుల్కల్‌లో బోరు వేస్తున్న దృశ్యం

## ఎండిన పంటలకు పరిహారం అందించాలి

మద్దూరు(ధూళిమిట్ట), మార్చి 9: నీళ్లులేక పంటలు ఎండిపోయి నష్టపోయిన రైతులకు ప్రభుత్వం వెంటనే నష్టపరిహారం అందించాలని సిద్దిపేట జిల్లా మద్దూరు మండల బీఆర్ఎస్ మాజీ అధ్యక్షుడు మలిపెద్ది మల్లేశం, బీఆర్ఎస్ మండల నాయకుడు సుందరగిరి పరశురాములు గౌడ్ డిమాండ్ చేశారు. మద్దూరు మండలంలోని మర్మాములలో ఎండిన పంటలను ఆదివారం వారు పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. లద్నూర్ రిజర్వాయర్‌తో పాటు చెరువు, కుంటలను నింపకపోవడంతో భూగర్భ జలాలు అడుగంటి పంటలు ఎండిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. కరెంట్ సరఫరా అంతంతమాత్రంగానే ఉందన్నారు. సీఎం రేవంత్‌రెడ్డికి వ్యవసాయం గురించి ఏం తెలియదని, అందుకే వ్యవసాయాన్ని నిర్లక్ష్యం చేస్తున్నారని మండిపడ్డారు. ప్రభుత్వం స్పందించి రైతులను ఆదుకోవాలని వారు కోరారు.



మర్మాములలో ఎండిన వరి చేనును పరిశీలిస్తున్న బీఆర్ఎస్ నాయకులు

# పాతాలంలో జలం..
# రైతుల కలవరం

- వందల ఫీట్లు వేసినా చుక్కనీళ్లు రావడం లేదు...
- రైతుకు తడిసిమోపెడవుతున్న అప్పులు
- సాగునీటి విడుదలలో కాంగ్రెస్ సర్కారు విఫలం
- ఉమ్మడి మెదక్ జిల్లాలో అడుగంటుతున్న భూగర్భ జలాలు
- పంటలు కాపాడుకోవడానికి రైతుల భగీరథ ప్రయత్నం

## బోర్లేసి బొక్కబోర్ల పడుతున్న రైతులు

సాగునీటి సమస్య రైతులను ఆందోళనకు గురిచేస్తున్నది. యాసంగి పంటలను దక్కించుకోవడానికి తంటాలు పడుతున్నారు. ఉమ్మడి మెదక్ జిల్లాలో భూగర్భజలాలు అడుగంటాయి. లక్షల రూపాయలు ఖర్చుచేసి బోర్లు తవ్వించినా, బావుల్లో పూడికతీయించినా ఆశించిన స్థాయిలో నీళ్లు రావడం లేదు. ప్రస్తుతం ఏ ఊరిలో చూసినా పొలాల వద్ద బోరు బండ్ల శబ్దం వినిపిస్తున్నది. క్రేన్లు కనిపిస్తున్నాయి. మళ్లీ పాత రోజు లు గుర్తుకు వస్తున్నాయి. రైతులు భగీరథ ప్రయత్నం చేస్తున్నారు. జిల్లాలో అనేక రిజర్వాయర్లు ఉన్నా కాం గ్రెస్ ప్రభుత్వం నీటి విడుదలలో ప్రణాళికతో వ్యవహరించకపోవడంతో నీళ్లందక పంటలు ఎండుతున్నాయి. కాళేశ్వర జలాలను పూర్తిస్థాయిలో ప్రభు త్వం విడుదల చేయలేదు. దేవాదుల ప్రాజెక్టు ద్వారా వచ్చే నీళ్లు ఇంతవరకు పత్తా లేవు. సింగూరు ప్రాజెక్టు కింద క్రాప్ హాలిడేను ప్రభుత్వం ప్రకటించింది. ఇతర ప్రాజెక్టుల కింద కాల్వల పనులు చేపట్టకపోవడంతో పొలాలకు నీళ్లు చేరడం లేదు. దీంతో పంటలు ఎండిపోతుండడంతో రైతులు దిగులు చెందుతున్నారు.



మెదక్ జిల్లా నిజాంపేటలో చుక్కనీరు రాని బోరుబావిని చూపుతున్న యువరైతు పంపరి రాజశేఖర్

సిద్దిపేట, మార్చి 9 (నమస్తే తెలంగాణ ప్రతినిధి): యా సంగి సాగు రైతులను తీవ్ర ఇబ్బందులకు గురి చేస్తున్నది. ఎండుతున్న వరి పంటను కాపాడుకోవడానికి సిద్దిపేట, మెదక్, సంగారెడ్డి జిల్లాల్లో రైతులు అరిగోస పడుతున్నారు. కొన్ని ప్రాంతాల్లో ట్యాంకర్ల ద్వారా పొ లాలకు నీటిని అందిస్తున్నారు. ఉమ్మడి మదక్ జిల్లాలో గత జనవరి, ఫిబ్రవరి నెలల్లో భూగర్భజలాలు బాగా అడుగంటాయి. అదే 2023 బీఆర్ఎస్ హయాంలో ఈ రెండు మాసాల్లో భూగర్భజలాలు పుష్కలంగా ఉన్నా యి. క్రమం తప్పకుండా చెరువులు, కుంటలు, చెక్‌డ్యామ్‌లను కాళేశ్వర జలాలతో నింపడంతో భూగర్భజలా లు వృద్ధి చెందాయి. బీఆర్ఎస్ హయాంలో ప్రణాళికాబద్ధంగా చెరువులు, చెక్‌డ్యాంలు నింపడంతో ఎక్కడా చూసినా మండుటెండల్లో అలుగులు పారాయి. బోరుబావుల్లో నీటిమట్టం పుష్కలంగా ఉంది. ఫలితంగా రైతులు గుంట పొలం ఎండిపోకుండా కాపాడుకున్నా రు. భూమికి బరువయ్యేలా పంటలను పండించారు. ప్రస్తుతం ఆ పరిస్థితి లేదు.

### పాతాళంలోకి జలం..

ఉమ్మడి మెదక్ జిల్లాలో భూగర్భజల మట్టం పూర్తిగా అడుగంటడంతో రైతులు అప్పులు చేసి బోరు బావులు తవ్విస్తున్నారు. కొద్దిరోజులుగా ఏ ఊరు వెళ్లినా బోర్లుబండ్లు కనిపిస్తున్నాయి. ఒకటి నుంచి మొదలుకొని ఎనిమిది వరకు బోర్లు తవ్వించిన రైతులు జిల్లాలో ఉన్నా రు. అయినా చుక్కనీరు రాకపోవడంతో రైతులకు అప్పులే మిగులుతున్నాయి.వందల ఫీట్ల లోతుకు బోర్లు వేసినా చుక్కనీరు రావడం లేదు. 2023 బీఆర్ఎస్ హయాంలో సిద్దిపేట జిల్లాలో 7.28 మీటర్లు, మెద క్ జిల్లాలో 10.46 మీటర్లు, సంగారెడ్డి జిల్లాలో 9.75 మీటర్ల లోతులో జలమట్టం ఉంది. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక ఈసారి 2025లో జనవరి నెలలో సిద్దిపేట జిల్లాలో 10.60 మీటర్ల, మెదక్ జిల్లాలో 10.89 మీట ర్ల, సంగారెడ్డి జిల్లాలో 10.27 మీటర్లు ఉంది. ఫిబ్రవరి నెలలో సిద్దిపేట జిల్లాలో 12.14అంటే 5 మీటర్ల లోతు కు పడిపోయింది. మెదక్ జిల్లాలో 13.25 మీట ర్లు ఇక్కడ 3.25 మీటర్ల లోతకు, సంగారెడ్డి జిల్లాలో 12. 60 మీటర్లు, ఇక్కడ 3 మీటర్ల లోతుకు భూగర్భజలాలు పడిపోయాయి. కేసీఆర్ పాలనలో భూగర్భజలాలు మెరుగ్గా ఉన్నాయి. కాంగ్రెస్ పాలనలో భూగర్భజలాలు అడుగంటి పంట పొలాలు ఎండిపోతున్నాయి. వాటని కాపాడుకోవడానికి రైతు అరిగోస పడుతున్నారు.



సిద్దిపేట జిల్లా చేర్యాల మండలం ఆకునూరులో బోరు తవ్విస్తున్న దృశ్యం

### లక్షన్నర అప్పులైనయ్..



నా పేరు చెట్కూరి కిష్టయ్య, మాది సిద్దిపేట జిల్లా మద్దూరు మండలంలోని మర్మాముల గ్రామం. రెండెకరాల్లో వరి పంట వేసిన. ఎకరానికి రూ.30వేల చొప్పున రెండెకరాలకు రూ.60వేల దాకా పెట్టుబడి అయ్యింది. ఎకరానికి విత్తనపు వడ్లకు రూ.2 వేలు, దున్నకం ఖర్చులు రూ.7500, నాటుకూళ్లు రూ.7500, అడుగు మందులకు రూ.6వేలు, పైమందులకు రూ.5500, కలుపుకూళ్లు రూ.1500 మొత్తం రూ 30వేలు, రెండెకరాలకు రూ.60వేల ఖర్చు వచ్చింది. ఇప్పుడు ఎకరం పూర్తిగా ఎండిపోయింది. పంటను కాపాడుకునేందుకు రెండు బోర్లు తవ్వించినా చుక్కనీళ్లు రాలే. పది రోజుల్లో రెండు బోర్లు వేస్తే రూ.లక్ష అప్పు అయ్యింది. పంట పెట్టుబడికి తోడు రూ.లక్ష బోర్లకు ఖర్చు అయ్యింది. రూ.1.60వేల నష్టం వచ్చింది.

– చెట్కూరి కిష్టయ్య , రైతు, మర్మాముల (సిద్దిపేట జిల్లా)

### రెండు బోర్లు వేయించినా నీళ్లు పల్లె..



నాకున్న వ్యవసాయ భూమిలో నాలుగు ఎకరాల మేర మక్క పంట ఏషిన. రోజురోజుకూ బోరు నుంచి నీళ్లు రావ డం తక్కువైంది.నీళ్లు లేక మక్క పంట ఎండిపోతదని భయం పట్టుకుంది. 400 ఫీట్ల వరకు రెండు బోర్లు వేయించినా. రెండింట్లో బొట్టు నీళ్లు రాలే. మొత్తం రూ.95 వేలు ఖర్చు అయ్యింది. మక్క పంట అమ్మినా అంతగానం పైసలు అచ్చే పరిస్థితి లేదు. కేసీఆర్ ఉన్నప్పుడు గింతగానం తక్లిబ్ కాలేదు. అప్పట్ల బోర్ల నుంచి మంచిగ నీళ్లు అంది మస్తు పంటలు పండించుకున్నం. కాంగ్రెస్ సర్కారు అచ్చినంక ఏ ఊర్లోకి వెళ్లినా మళ్ల బోరు బండ్లు కనిపిస్తున్నయి.

– పంపరి రాజశేఖర్, యువరైతు, నిజాంపేట (మెదక్ జిల్లా)




బంజేరుపల్లిలో హరీశ్‌రావు చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న రైతులు

## హరీశ్‌రావు చిత్రపటానికి క్షీరాభిషేకం

నారాయణరావుపేట, మార్చి 9 : రంగనాయకసాగర్ నుంచి ఎడమ కాల్వ ద్వారా సాగునీరు విడుదల చేయించినందుకు నారాయణరావుపేట మండలం బంజేరుపల్లిలో ఆదివారం ఎమ్మెల్యే హరీశ్‌రావు చిత్రపటానికి రైతులు క్షీరాభిషేకం చేశారు. పంటలకు సాగునీరు అందడంపై సంతోషం వ్యక్తం చేస్తూ హరీశ్‌రావుకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో రైతులు, గ్రామస్తులు ఉన్నారు.

## చదువుకోమన్నందుకు విద్యార్థి బలవన్మరణం



విజయేందర్‌రెడ్డి(ఫైల్)

వర్గల్,మార్చి 9: పరీక్షలకు బాగా చదువుకోమని తల్లి మందలించడంతో విద్యార్థి పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్న సంఘటన ఆదివారం వెలుగులోకి వచ్చింది. గౌరారం ఎస్సై కరుణాకర్‌రెడ్డి వివరాల ప్రకారం.. సిద్దిపేట జిల్లా వర్గల్ మండలం చాంద్‌ఖాన్‌మక్త గ్రామానికి చెందిన మర్కంటి గోపాల్‌రెడ్డి, కనకవ్వ దంపతుల కుమారుడు మర్కంటి విజయేందర్‌రెడ్డి(16) చౌదర్‌పల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాల్లో పదో తరగతి చదువుతున్నాడు. ఈనెల 6న కనకవ్వ పొలం వద్ద ఉండగా విజయేందర్‌రెడ్డి ఆమె వద్దకు వెళ్లాడు. పరీక్షలు పెట్టుకుని కుమారుడు సమయ వృథా చేస్తూ తిరుగుతుండడంతో తల్లి మందలించింది. దీంతో విజయేందర్‌రెడ్డి చేనులో ఉన్న పురుగుల మందు తాగాడు. గమనించిన కనకవ్వ ఇరుగు పొరుగు వారి సాయంతో కుమారుడికి గజ్వేల్ ప్రభుత్వ దవాఖానకు తరలించింది. పరిస్థితి విషమించడంతో హైదరాబాద్ తరలించగా, శనివారం అర్ధరాత్రి ఆరోగ్యం విషమించి మరణించాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తునట్టు ఎస్సై తెలిపారు.



మనూరు గ్రామంలోని పొలంలో వంగిన విద్యుత్ స్తంభం



బోరంచ శివారులో విద్యుత్ స్తంభానికి అల్లుకున్న తీగలు



మాయికోడ్ శివారులో విద్యుత్ తీగలకు పెట్టిక కర్ర



రుక్మాపూర్ శివారులోని పొలంలో ఒరిగి పడిపోవడానికి సిద్ధంగా ఉన్న విద్యుత్ స్తంభాలు

# పడిపోతే ప్రమాదమే..

- పలుచోట్ల ప్రమాదకరంగా విద్యుత్ స్తంభాలు
- చేతికందే ఎత్తులో వేలాడుతున్న తీగలు
- బిక్కుబిక్కుమంటున్న రైతులు

జహీరాబాద్/మనూరు, మార్చి 9 : పంట పొలాల్లో ఒకవైపు ఒరిగిన విద్యుత్ స్తంభాలు, చేతికందే ఎత్తులో వేలాడుతున్న కరెంట్ తీగలు, వైర్లను కప్పేస్తూ అల్లుకున్న చెట్లకొమ్మలతో విద్యుత్ ప్రమాదాలు పొంచి ఉన్నాయి. సంగారెడ్డి జిల్లాలోని జహీరాబాద్, నారాయణఖేడ్ నియోజకవర్గాల్లోని ఆయా గ్రామాల్లో రోడ్ల ఇరువైపులా, పొలాల గుం డా ఉన్న 11కేవీ, 33 కేవీ, సోలార్ విద్యుత్ స్తంభాలు పూర్తిగా ఒరిగిపోయి పడిపోవటానికి సిద్ధంగా ఉన్నా విద్యు త్ శాఖ అధికారులు పట్టించుకోవడం లేదనే విమర్శలు ఉన్నాయి. వీటితో ఏ ప్రమాదాలు జరుగుతాయోనని రైతు లు ఆందోళన చెందుతున్నారు. జహీరాబాద్ నియోజకవర్గంలోని మొగుడంపల్లి మండలంలోని ఇప్పెపల్లి, మొగుడంపల్లి తదితర గ్రామాలతో పాటు న్యాల్‌కల్ మండలంలోని హద్నూర్‌లో షార్ట్ సర్క్యూట్‌తో ఇటీవల చెరుకు తోటలు కాలిపోయి రైతులకు తీవ్ర నష్టం జరిగింది. చాలా గ్రామాల్లో విద్యుత్ తీగలు వేలాడుతున్నాయి. మనూరు మండల పలుచోట్ల చేనుల్లో చేతికందే ఎత్తులో విద్యుత్ తీగలు వేలాడుతున్నా విద్యుత్ అధికారులు స్పందించడం లేదు. దీంతో రైతులు చెట్ల కొమ్మలు, కర్రల సహాయంతో విద్యుత్ తీగలకు అడ్డుపెట్టారు. వంగిన విద్యుత్ స్తంభాలు సరి చేయాలని పలుమార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లినా స్పందించడం లేదని రైతుల ఆరోపించారు.



హద్నూర్ సమీపంలో ఒరిగిపోయిన సోలార్ విద్యుత్ స్తంభాలు